సాక్షి సిద్దిపేట


శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



అతివలకు ‘అభయ’

మహిళలు, బాలికల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందుకు ‘అభయ’ యాప్‌ను తీసుకొచ్చింది.

వివరాలు 8లో ▸



చెరువు కట్ట.. కుదిస్తే ఎట్లా?

హుస్నాబాద్‌లోని ఎల్లమ్మ చెరువు కట్ట రోజురోజుకు కుచించుకుపోతోంది. మరమ్మతుల పేరిట నాసిరకం పనులు చేపడుతున్నారు.

వివరాలు 9లో ▸



ఖాళీ బిందెలతో నిరసన

మంచినీరు రావడం లేదని ఆగ్రహించిన మహిళలు ఖాళీ బిందెలతో శుక్రవారం ఆందోళనకు దిగారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

లంచం అడిగితే ఫోన్ చేయండి

జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ చంద్రమోహన్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ శాఖకు సంబంధించిన అధికారులు, సిబ్బంది లంచం అడిగితే వెంటనే ఫోన్ చేయాలని ఎస్ఈ చంద్రమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులను వివిధ పనుల నిమిత్తం లంచం అడిగితే వెంటనే 040–23454884, 7680901912లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రతి ఎలక్ట్రిసిటీ కార్యాలయాలలో సర్కిల్ ఆఫీస్, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్, ఈఆర్‌ఓ ఆఫీస్, ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్, సబ్‌స్టేషన్‌లలో అధికారులు, సిబ్బంది పనులకు లంచం అడిగితే వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు.

రేపటి నుంచి సిటీ పోలీస్ యాక్టు అమలు

సిద్దిపేటకమాన్: పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం నుంచి సిటీపోలీస్ యాక్టు అమలులో ఉంటుందని సీపీ అనురాధ శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో ఈ నెల 30వ తేదీ వరకు నిబంధనలు అమల్లో ఉంటాయన్నారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, సమావేశాలు, సభలు నిర్వహించకూడదని తెలిపారు. అలాగే సౌండ్ వినియోగంపై ఉన్న నిషేధాజ్ఞలు కూడా పొడిగిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

పెరటి కోళ్లతో ఆర్థికాభివృద్ధి



నెంటూరులో మహిళలకు పెరటికోళ్లు పంపిణీ చేస్తున్న ఏపీఎం ఆనంద్‌కుమార్

వర్గల్(గజ్వేల్): స్వయం సహాయక సంఘం మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా పెరటికోళ్లు పంపిణీ చేస్తున్నదని వర్గల్ ఏపీఎం ఆనంద్ కుమార్ అన్నారు. శుక్రవారం వర్గల్, చౌదరిపల్లి, నెంటూరు, మజీద్‌పల్లి, వేలూరు కేంద్రాలుగా మండల వ్యాప్తంగా 2,090 కోళ్లను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సాధారణ పెరటి కోళ్లమాదిరిగా వీటిని పెంచుకుని అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు సుభాష్‌గౌడ్, సత్యనారాయణ, నర్సింలు, పద్మలత, సాయిలు, రమేష్, భాస్కర్, సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

బైరాన్‌పల్లిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



బురుజు వద్ద అమరులకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): బైరాన్‌పల్లిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శుక్రవారం దూళ్మిట్ట మండలం బైరాన్‌పల్లిలోని అమరవీరుల స్తూపానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. బురుజు వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి అందె అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాట అమరులను స్మరిస్తూ 76వ వార్షికోత్సవాలను సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఒకే రోజు 118 మంది ప్రాణాలను కోల్పోయారని ఇలాంటి పోరాట ఘట్టాలను గుర్తించి నాటి అమరుల పోరాట చిహ్నాలను ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణపురం లక్ష్మణ్, మద్దూరు మండల కార్యదర్శి జంగిటి యాదగిరి పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు జీవనోపాధి కల్పించండి

సిద్దిపేటజోన్: బీడీ కార్మికులకు జీవనోపాధి కల్పించాలని బీడీ కార్మిక సంఘం(హెచ్‌ఎంఎస్) జిల్లా అధ్యక్షుడు మల్లేశం కోరారు. శుక్రవారం దయాలాల్ మెగ్జి టోబాకో(బాషా) కంపెనీ తరలింపుపై కార్మిక శాఖ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల యాజమాన్యం సిద్దిపేట నుంచి కంపెనీ తరలిస్తున్నట్టు కమిషన్ ఏజెంట్లకు నోటీసులు జారీ చేసిందన్నారు. కార్మిక శాఖ అధికారులు సంబంధించిన కంపెనీ యాజమాన్యంతో చర్చించి ఇక్కడినుంచి తరలించకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మధు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీ వినాయకుడు



హుస్నాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో కరెన్సీ నోట్లతో అలంకరించిన వినాయక మండపం

జిల్లాలో గణపతి నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వినాయక మండపాలను రోజుకొక రూపంలో అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ క్రమంలో హుస్నాబాద్ పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన మండపాన్ని కరెన్సీ నోట్లతో అలంకరించారు. శుక్రవారం ఉదయం పూజ అనంతరం రూ.10లక్షల విలువైన నోట్లతో అందంగా అలంకరించారు. కరెన్సీలతో ఉన్న వినాయకుడిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

– హుస్నాబాద్

సత్వరం.. సస్యరక్షణ

పంటల రక్షణకు చర్యలు తప్పనిసరి

- మోతాదుకు మించి క్రిమిసంహారక మందులు వాడొద్దు
- నీరు నిలువ లేకుండా చూడాలి
- శాస్త్రవేత్తల, అధికారుల సూచనలు పాటించాలి
- తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి
- సాక్షి ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన



ఫోన్ ద్వారా సూచనలు సలహాలు అందిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి

సిద్దిపేటరూరల్/ ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ‘జిల్లాలో ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని వర్షాలతో పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. దీంతో పాటు పంటలకు వివిధ రకాల తెగుళ్లు ఆశించాయి. ఇందుకు సత్వరం సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలి. అలాగే చేనుల్లో నిలిచిన నీటిని బయటకు పంపించాలి. గజ్వేల్ ప్రాంతంలో నల్లరేగడి భూముల్లో ఎక్కువ శాతం నీరు నిల్వ ఉండడం వల్ల పత్తి దెబ్బతినే అవకాశం ఉంది. రైతులు తక్షణం తగు జాగ్రత్తలు తీసుకోవాలి. హుస్నాబాద్ ప్రాంతంలో వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పంటచేలల్లో ఇసుక మేటలు వేసింది. ఇసుకను తీసేందుకు చర్యలు చేపట్టాలి’ అని తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ఆమె రైతులకు సూచనలు, సలహాలు అందించారు. ఈ ఫోన్ ఇన్ కార్యక్రమంలో జిల్లా నుంచి అధిక సంఖ్యలో రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

ప్రశ్న: వర్షాలతో వరి పంట ఎర్రగా మారుతోంది. ఎదగడం లేదు. ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

– రేణికుంట వెంకటేశ్, బైతి తిరుపతి రాఘవాపూర్

శాస్త్రవేత్త: ఎడతెరిపిలేని వర్షాలతో వరి పంట దెబ్బతినడంతో తెగుళ్లు సోకాయి. ఎండాకుతెగులు, మచ్చలు వంటివి కన్పిస్తున్నాయి. తెగుళ్ల నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ ఎకరాకు 400 గ్రాములు , 0.2 గ్రాములు స్ట్రెప్టోమైసిన్ మందును లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పంటకు పిచికారీ చేసుకోవాలి.

ప్రశ్న: మొక్కజొన్న కాండం కుళ్లిపోయి కర్రలు విరుగుతున్నాయి. ఏమి చేయాలి?

– నగేష్‌రెడ్డి, ఉమేష్, రాజు

శాస్త్రవేత్త: అధిక వర్షాలతో మొక్కజొన్న పంట సైతం దెబ్బతిన్నది. కంకి వచ్చిన తర్వాత కింది భాగంలో కాండం కుళ్లి పోతోంది. వీటి నివారణకు ఎలాంటి చర్యలు లేవు. సాగుకు ముందుగానే తెగులును తట్టుకునే మేలు రకం విత్తనాలను విత్తుకోవడం ఉత్తమం. అందుకు గాను శాస్త్రవేత్తలను, వ్యవసాయ అధికారులను సాగుకు ముందు సంప్రదించాలి.

ప్రశ్న: వరి పైరు ఆకులు ఎర్రగా మారుతున్నాయి. రెక్కల పురుగులు ఆశిస్తున్నాయి, పంటను రక్షించే జాగ్రత్తలు తెలపండి?

– జస్వంత్‌రెడ్డి, దుర్గారెడ్డి పుల్లూరు

శాస్త్రవేత్త: చిన్నకోడూరు, సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాలతో పాటుగా జిల్లాలోని వివిధ మండలాల పరిధిలో ఈ తెగుళ్ళు వస్తున్నాయి. దీనికి కారణం ఎక్కువగా నత్రజని ఎరువుల వినియోగమే. తక్కువ శాతంలో యూరియా వాడాలి. సమస్య పరిష్కారానికి కాపర్ హైడ్రాక్సైడ్‌ను ఎకరం పంటకు గాను లీటర్ నీటికి 400 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలి. రెక్కల పురుగుల తాకిడి ఉంటే వాటిని రాత్రి సమయంలో ట్రాపింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలి. వాటి కోసం కార్టప్ హైడ్రోక్లోరైడ్ పొడి మందును చల్లాలి.

ప్రశ్న: వరిలో కాండం వేర్లు కుళ్లి పోయి ఎర్రబడుతోంది. ప్రస్తుతం పంట పొట్టదశలో ఉంది రక్షణ ఎలా?

– రాజమల్లు, మల్లయ్య, అయిలయ్య, పాలపాకుల

శాస్త్రవేత్త: పంట పొలంలో ఎక్కువగా నీరు నిల్వ ఉండడం వల్ల వరి కాండం కుళ్లి పోతోంది. ఎక్కువగా నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పొలాన్ని కొద్దిగా ఆరబెట్టినట్లు చేయడం ద్వారా కాండం కుళ్లి పోకుండా రక్షించవచ్చు.

ప్రశ్న: కందికి ఎండుతెగులు సోకింది. పంట ఎండిపోతుంది. ఎలాంటి చర్యలు చేపట్టాలి?

– ఏర్వ మల్లేశం, బాలయ్య, నర్సయ్య

శాస్త్రవేత్త: ఎకరా పంటకు గాను కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలుపుకుని పంటకు పిచికారీ చేసుకోవాలి. పంటలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటించాలి.

ప్రశ్న: వరి పైరు గొలుసు వంగి పోతోంది. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– బాలయ్య, స్వామి, వెంకటయ్య

శాస్త్రవేత్త: వరి కంకి దగ్గర మచ్చలు వంటి తెగులు వస్తే గొలుసు వంగిపోతుంది. దీనిని మెడవిరుపు తెగులు అంటారు. దీని నివారణకు గాను ఎకరా పంటకు లీటర్ నీటికి 0.6 మి.లీ ట్రైసైక్లోజోల్ కలిపి పిచికారీ చేసుకోవాలి.

ప్రశ్న : మాది నల్లరేగడి భూమి, మేము సాగు చేసిన పత్తి పంట మొదలు కుళ్లిపోతోంది. నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి?

– రాములు, కిషన్, కిష్టయ్య, అలీరాజ్‌పేట.

శాస్త్రవేత్త: మురుగు నీరును పంట చేనులో నిల్వ లేకుండా చూడాలి. వర్షం తగ్గింది అందువలన పత్తి చేనుకు పిండినల్లి తెగులు వచ్చే అవకాశం ఉంది. నివారణకు 1.5 గ్రాముల ఎసిఫెట్ లేదా 2 మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

బీజేపీ మరింత బలోపేతం



వంటిమామిడి మార్కెట్ యార్డులో బీజేపీ సభ్యత్వ నమోదును చేయిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

- పార్టీ సభ్యత్వానికి అనూహ్య స్పందన
- కేంద్ర మాజీ మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్
- ప్రజ్ఞాపూర్‌లో సభ్యత్వ నమోదు ముమ్మరం
- పాల్గొన్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

గజ్వేల్: బీజేపీ చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తున్నదని కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సభ్యత్వ నమోదును చేపడుతున్నట్లు చెప్పారు. దేశంలో బీజేపీని అతి పెద్ద రాజకీయ పార్టీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నట్లు వెల్లడించారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని పూర్తి చేయడానికి కార్యకర్తలు, నాయకులు సమన్వయం పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు గురువారెడ్డి, డాక్టర్ నరేష్‌బాబు, పట్టణ శాఖ అధ్యక్షులు మనోహర్ యాదవ్ పాల్గొన్నారు.

విజయవంతం చేద్దాం..

ములుగు(గజ్వేల్): బీజేపీ సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎంపీ రఘునందన్‌రావు, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ పిలుపు నిచ్చారు. ములుగు మండలం వంటిమామిడి కూరగాయల మార్కెట్ యార్డులో పార్టీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని బీజేపీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు చింతల అరుణ్‌కుమార్‌రెడ్డి, వర్గల్, మర్కూక్ మండల అధ్యక్షులు బాల్‌రెడ్డి, రాంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

6,16,009 మంది ఓటర్లు

- ముసాయిదా జాబితా విడుదల
- పురుషులకంటే మహిళా ఓటర్లు అధికం
- 21వ తేదీ వరకు అభ్యంతరాలు
- 28న తుది జాబితా



నారాయణరావుపేటలో ఓటరు జాబితాను ప్రదర్శించిన కార్యదర్శి రవి

సిద్దిపేటరూరల్: గ్రామపంచాయతీ ఎన్నికల కసరత్తులో భాగంగా శుక్రవారం జిల్లా ఓటరు జాబితా ముసాయిదాను అధికారులు విడుదల చేశారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను ప్రదర్శించారు. 507 గ్రామ పంచాయతీల్లో 6,16,009 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,03,141 మంది, మహిళలు 3,12,861 మంది ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 9,720 మంది అధికంగా ఉన్నారు. ఈనెల 14 నుంచి 21వరకు ఓటర్ల నుంచి అభ్యంతరాలను స్వీకరించి, 28న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.

తొలగని టెక్నికల్ సమస్య

జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్ ఓటరు నమోదు కార్యక్రమం పూర్తి అయినప్పటికీ రూరల్ మండలానికి చెందిన 15 గ్రామాల్లో ఆన్‌లైన్ నమోదుకు టెక్నికల్ సమస్య పరిష్కారం కాలేదు. జాబితా ఎప్పుడు విడుదల అవుతుందనే విషయంపై నేటికీ అధికారులకు స్పష్టత లేదు. 28న తుది జాబితా వెలువడనున్న నేపథ్యంలో సమస్య ఎప్పుడు పరిష్కారం అవుతుందో వేచి చూడాల్సిందే.

బస్సు కోసం రోడ్డెక్కిన విద్యార్థులు



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

దుబ్బాకటౌన్: కళాశాలకు వెళ్లడానికి సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు రోడ్డెక్కారు. శుక్రవారం రాయపోల్ మండలం వడ్డేపల్లి గుర్రాల సోప వద్ద రహదారిపై ధర్నా చేపట్టారు. విద్యార్థుల ధర్నాలో మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పట్టణంలో వివిధ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న రాయపోల్ మండల విద్యార్థులు బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. విధిలేక ఆటోలను ఆశ్రయిస్తున్నారన్నారు. ముఖ్యంగా బాలికలు కిలోమీటర్ల దూరం నడవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. అధికారులు వెంటనే బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ధర్నాతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో ఘటనా స్థలానికి రాయపోల్ ఎస్ఐ రఘుపతి చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు. రెండు రోజులలో బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ధర్నా విరమించారు.

రాష్ట్రంలో నిర్బంధ రాజకీయాలు



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

- కాంగ్రెస్ విధానాలపై పోరాడుతాం
- ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు
- గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ నేతల అరెస్ట్, విడుదల

గజ్వేల్: రాష్ట్రంలో నిర్బంధ రాజకీయాలు తగవని, గుండాయిజాన్ని ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ విధానాలపై ప్రజలతో కలిసి పోరాడుతామని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం బీఆర్‌ఎస్ నేతల ముందస్తుగా అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేసిన అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. పోలీసులను అడ్డం పెట్టుకొని ముఖ్యమంత్రి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై అరికెపూడి గాంధీతోపాటు అతని అనుచరులు దాడి చేసి విధ్వంసం సృష్టించడం సహించరానిదన్నారు. ఈ ఘటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు సీపీ కార్యాలయం వద్ద ధర్నా దిగితే అరెస్ట్ చేసి... 300కిలోమీటర్లు వాహనాల్లో తిప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను, తప్పులను ప్రశ్నిస్తే బీఆర్‌ఎస్ గొంతు నొక్కాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్బంధ రాజకీయాలను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ మల్లేశం, బీఆర్‌ఎస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు బెండె మధు, పట్టణ శాఖ అధ్యక్షులు నవాజ్ మీరా, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.


సెంట్రల్ డ్రగ్ స్టోర్ తనిఖీ



సిద్దిపేటకమాన్: పట్టణంలోని పాత ఎంసీహెచ్ భవనంలో కొనసాగుతున్న సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను టీజీఎంఎస్ఐ జనరల్ మేనేజర్ ప్రభాకర్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్‌లోని మందుల సరఫరా, స్టాక్ వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఫార్మసిస్టులకు పలు సూచనలు చేశారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు బాటలు వేయండి

- జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు

మర్కూక్(గజ్వేల్): విద్యార్థులను లక్ష్య సాధన దిశగా నడిపించే బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగు, మర్కూక్, వర్గల్, గజ్వేల్, కొండపాక, కుకునూరుపల్లి పాఠశాలలో పనిచేస్తున్న 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. గజ్వేల్ నియోజకవర్గం నుంచి 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఉదయ్ భాస్కర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, రోటరీ క్లబ్ స్పోర్ట్స్ చైర్మన్ బాబుగౌడ్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లకు కరెంట్, నీటి సరఫరా నిలిపివేత

- అనర్హులు ఖాళీ చేయాలంటూ గ్రామస్తుల ఆందోళన
- సర్వే చేసి తేలుస్తామంటున్న అధికారులు



గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎస్ఐ

దుబ్బాకరూరల్: గ్రామస్తులంతా ఏకమై డబుల్ బెడ్రూం ఇళ్లకు కరెంట్, నీటిసరఫరాను నిలిపివేశారు. అనర్హులంతా ఖాళీ చేయాల్సిందేనంటూ ఆందోళనకు దిగారు. ఈ ఘటన మండలంలోని బల్వంతాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో గత ప్రభుత్వం ఇరవై డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించింది. గతంలో అర్హులకు కాకుండా అనర్హులకు ఇచ్చారని గ్రామ ప్రజలు ఆరోపించారు. శుక్రవారం గ్రామస్తులంతా ఏకమై ఇళ్లలో నివాసముంటున్న వారి సామగ్రిని బయట పెట్టారు. కరెంట్ సరఫరా, నీటి సరఫరా నిలిపి వేశారు. మూడు గంటలకు పైగా ఆందోళన కొనసాగింది. తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ గంగరాజ్ సంఘటన స్థలానికి చేరుకుని గ్రామ ప్రజలతో చర్చించారు. తహసీల్దార్ మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్ల విషయం కలెక్టర్ పరిధిలోని ఉందన్నారు. ఇందులో ఎవ్వరు అనర్హులు అనేది సర్వే ద్వారా గుర్తిస్తామన్నారు. అనర్హులు ఉంటే ఖాళీ చేయించి నిజమైన అర్హులను గుర్తించి ఇళ్లు పంపిణీ చేస్తామన్నారు. వారం రోజుల్లో గ్రామంలో సర్వే చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కరెంట్, నీటి సరఫరా పునరుద్ధరించాలని, ఎవ్వరినీ ఇబ్బందులకు గురి చేయకూడదని తహసీల్దార్ సూచించారు.

క్లుప్తంగా

మహిళా శక్తి క్యాంటీన్‌లో శుభ్రత పాటించాలి

– జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి


క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న సాయి రమాదేవి, అశ్రిత్‌కుమార్

సిద్దిపేటకమాన్: క్యాంటీన్‌లో శుభ్రత పాటించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి, మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ అన్నారు. సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలోని మహిళా శక్తి క్యాంటీన్ స్థలాన్ని, కాంటీన్‌ను శుక్రవారం ఇద్దరూ పరిశీలించారు. క్యాంటీన్ నిర్వహించే భారతితో ఇరువురు అధికారులు మాట్లాడారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో వంట సామగ్రి ఎక్కువగా అమరేలా సెల్ఫ్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. క్యాంటీన్‌తోపాటు చుట్టూ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, సెక్రటరీ మంతూరి సత్యనారాయణ, పత్రి ప్రకాశ్, రవీందర్, రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుడు అరెస్టు

– మాయమాటలతో బ్యాంకు మేనేజర్‌కు బురిడీ

సిద్దిపేటకమాన్: మాయ మాటలతో బ్యాంకు మేనేజర్ నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు కాజేసిన సైబర్ నేరస్తుడిని పోలీసులు అరెస్టు చేశారు. సిద్దిపేట సైబర్ క్రైమ్ ఏసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఓ బ్యాంకులో మేనేజర్‌గా పని చేసే వ్యక్తి వాట్సాప్‌కు కొద్ది రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తి ఓ లింకు పంపాడు. తక్కువ మొత్తంలో పెట్టుబడిగా పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని బ్యాంకు మేనేజర్‌ను నమ్మించాడు. సైబర్ నేరస్తుడి మాటలు నమ్మిన బ్యాంకు మేనేజర్ ఆ లింకు ద్వారా ఆన్‌లైన్ (గూగుల్ పే, ఫోన్ పే, నెట్ బ్యాంకింగ్)లో 25 రోజుల్లో పలు విడతలుగా రూ.80 లక్షలు పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో అనుమానం వచ్చి బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేసి, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు టెక్నాలజీ సాయంతో నిందితుడిని గుర్తించి అనకాపల్లి జిల్లాకు చెందిన భీమిశెట్టి వెంకటరామ్‌ను హైదరాబాద్ మాదాపూర్ హైటెక్ సిటీ ప్రాంతంలో శుక్రవారం పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. బాధితుడు పంపిన ఖాతాలో ఉన్న రూ.20 లక్షలు రికవరీ చేసి బాధితుడికి అందజేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా నిందితుడి నుంచి రూ.50 వేల నగదు, సెల్‌ఫోన్, రెండు బ్యాంకులకు చెందిన చెక్ బుక్‌లను స్వాధీనం చేసినట్లు ఏసీపీ శ్రీనివాస్ తెలిపారు.

తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు

రోడ్డుపై ఆడుకుంటూ తప్పిపోయిన ఇద్దరు


పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు, ఫౌండేషన్ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: ఆడుకుంటూ తప్పిపోయిన ఇద్దరు పిల్లలు తల్లిదండ్రుల చెంతకు చేరారు. ఎండీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మధు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జేపీ కాలనీ రోడ్ నంబర్ 2లో ఇద్దరు చిన్నారులు శుక్రవారం రోడ్డు పై ఏడుచుకుంటూ కనిపించారు. దీంతో ఎండీఆర్ ఫౌండేషన్ సభ్యులు చిన్నారులను పోలీస్ స్టేషన్ తీసుకొచ్చారు. అనంతరం ఎస్‌ఐ అంబరయ్య తో కలిసి ఫౌండేషన్ సభ్యులు డివిజన్ పరిధిలోని కాలనీలు తిరుగుతుండగా, చిన్నారులు అంబేడ్కర్ కాలనీవాసులుగా గుర్తించారు. అప్పటికే చిన్నారుల తల్లిదండ్రులు వెతుకుతూ కనిపించడంతో వారికి పిల్లలను అప్పగించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు పోలీసులకు, ఫౌండేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అతివలకు అభయ

మహిళల రక్షణ కోసం కొత్త యాప్ అందుబాటులోకి..

- ఒంటరిగా ప్రయాణించే వారికి ఉపయోగపడేలా క్యూఆర్ కోడ్
- ఆటోలు, ఇతర వాహనాలకు స్టిక్కర్లు
- డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- జీపీఎస్ సిస్టం ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం


ఆటో డ్రైవర్లకు అభయ యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

సిద్దిపేటకమాన్: మహిళలు, బాలికల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. అందులో భాగంగానే పోలీసుశాఖ ఆధ్వర్యంలో షీ టీమ్స్, భరోసా, సఖి, స్నేహిత మహిళా సపోర్టు సెంటర్‌ల ద్వారా సేవలు అందజేస్తున్నారు. అదే విధంగా మహిళల రక్షణ కోసం మరో యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది ప్రభుత్వం. అదే 'అభయ' యాప్. ఆటోల్లో ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు, బాలికలకు డ్రైవర్ నుంచి అనుకోకుండా ఏదైనా ప్రమాదం ఎదురు కావొచ్చు. వెంటనే వారు ఆటో, క్యాబ్ ఇతర వాహనాల్లో ఏర్పాటు చేసిన అభయ యాప్‌ను మొబైల్ ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే వారి వివరాలు పోలీసులకు చేరుతాయి. వెంటనే పోలీసులు అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకొని మహిళలను రక్షిస్తారు.

ఆటోల్లో అభయ స్టిక్కర్లు

ఆటో డ్రైవర్లు రూ.300 చెల్లిస్తే యాప్ స్టిక్కర్‌తో పాటు డ్రైవర్‌కు రూ.లక్ష ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడం జరుగుతుంది. ఇందులో డ్రైవర్ పూర్తి వివరాలు, ఫోన్ నంబర్, ఆటో నంబర్ వివరాలు నమోదు చేసి ఉంటాయి. ఈ వివరాలతో కూడిన యాప్ స్టిక్కర్‌ను ఆటోలో కూర్చున్న ప్రయాణికులకు కనిపించేలా అతికిస్తారు. వీటిని జీపీఎస్ సిస్టం ద్వారా పోలీసు కంట్రోల్ రూమ్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు. ఆటోలో మహిళలు ఒంటరిగా ప్రయాణిస్తున్న సమయంలో శివారు ప్రాంతం, ఇతర ప్రాంతాల్లో డ్రైవర్‌పై ఏదైనా అనుమానం ఉంటే, అనుకోకుండా ఏదైనా ఆపద ఎదురైతే మహిళలు మొబైల్ ద్వారా అభయ యాప్‌ను స్కాన్ చేసి వివరాలు (ఫోన్ నంబర్) నమోదు చేస్తే జీపీఎస్ సిస్టం ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందుతుంది. వెంటనే పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను, ఆపదలో ఉన్న మహిళలను రక్షిస్తారు. ఈ యాప్ ముఖ్య ఉద్దేశ్యం ఆటోలో ప్రయాణించే మహిళల రక్షణ కోసం తయారు చేసినట్లు పోలీసులు తెలుపుతున్నారు.

డ్రైవర్లకు అవగాహన

అభయ యాప్‌పై సిద్దిపేట పట్టణంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తే మహిళలు, బాలికలు ఒంటరిగా ప్రయాణిస్తున్న సమయంలో వారిపై జరిగే దాడులను నివారించొచ్చు. అభయ యాప్ ఆటోలో, ఇతర క్యాబ్‌లలో ఒంటరిగా ప్రయాణించే మహిళలు, బాలికలకు భద్రత, రక్షణగా ఉపయోగపడనుంది. త్వరలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆటోలు, క్యాబ్‌లలో అభయ యాప్‌ను పోలీసులు అందుబాటులోకి తేనున్నారు.

స్టిక్కర్లు కచ్చితంగా ఉండాలి



అభయ యాప్‌ను ఆటోల్లో, ఇతర క్యాబ్‌లలో ఏర్పాటు చేయడం ద్వారా శివారు ప్రాంతాల్లో ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలు, బాలికలకు ఎంతో రక్షణగా ఉపయోగకరంగా ఉంటుంది. అభయ యాప్ గురించి ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నాం. త్వరలోనే ఆటో డ్రైవర్లకు యాప్ స్టిక్కర్లను అందించడం జరుగుతుంది. అందరూ ఏర్పాటు చేసుకోవాలి. మహిళలు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

–ప్రవీణ్‌కుమార్, సిద్దిపేట ట్రాఫిక్ సీఐ

అందరికీ ఆ రైతే వారధి

- గుండువాగుపై వంతెన నిర్మించిన టేక్మాల్ మండల వాసి రాములు
- సుమారు రూ.2.10 లక్షలు ఖర్చు చేసి నిర్మాణం
- పొలాలకు వెళ్లడానికి దారి లేక వినూత్న ఆలోచన
- చుట్టుపక్కల రైతులకు సైతం ఎంతో మేలు


వెల్డింగ్ చేస్తూ వంతెనను తయారు చేస్తున్న రైతు రాములు


పూర్తయిన వంతెన

టేక్మాల్(మెదక్): వాగుదాటలేక.. పంట పండించలేక.. ఇబ్బంది పడిన ఓ రైతు పొలాలకి వెళ్లేందుకు ఏకంగా వారధినే కట్టుకున్నాడు. తన ఆలోచనకు పదును పెట్టి సొంత డబ్బులతో తానే స్వయంగా ఇనుప రాడ్లతో వంతెనను ఏర్పాటు చేశాడు. తాను చేసిన పనికి ఎంతో మంది రైతులకు మేలు జరుగడంతో రాములును తోటి రైతులంతా అభినందిస్తున్నారు.

టేక్మాల్ మండంలోని పలు గ్రామాల మీదుగా గుండువాగు ప్రవహిస్తుంది. కాస్త వర్షం కురిసినా గుండువాగు ఉధృతంగా ప్రవహించి అవతలివైపునకు వెళ్లనిచ్చేది కాదు. టేక్మాల్‌లో గుండువాగు అవతల వైపు వందలాది ఎకరాల సాగు భూమి ఉంది. రైతులు పత్తి, వరి, జొన్న, మొక్కజొన్న, మినుము, కంది, పెసర ఇతర పంటలను సాగు చేస్తారు. వర్షాకాలంలో సాగు భూమిలోకి వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉండేది. వాగు వచ్చిందంటే నీళ్లు తగ్గేదాక అవతలికి వెళ్లలేని పరిస్థితి. పంటలు సాగు చేయలేక ఇబ్బంది పడుతూ వచ్చారు. వ్యవసాయ పనులకు కూలీలు గాని, మందు సంచులు తీసుకెళ్లడం, పండించిన ధాన్యాన్ని తీసురావడం నానా ఇబ్బంది పడేవారు.

ఎవరి సాయం లేకుండా ఒక్కడే నిర్మాణం

పంటల సాగుకు అంతరాయం ఏర్పడుతుందని టేక్మాల్‌కు చెందిన కమ్మరి రాములు అనే రైతు వంతెన తయారు చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. వాగు అవతలి వైపు తనకు సుమారుగా 15 ఎకరాల సాగు భూమి ఉంది. వేసవిలో వాగులో నీళ్లు లేనప్పుడు ఆరు స్తంభాలను లోపలికి పాతి, వాటిపై ఇనుప రాడ్లతో వంతెన తయారు చేశాడు. ఏ ఒక్కరి సాయం లేకుండా తానే అన్ని సామగ్రిని సమకూర్చుకొని ఇనుప రాడ్లకు వెల్డింగ్ చేసుకుంటూ వంతెనను పూర్తి చేశాడు. ప్రస్తుతానికి రాకపోకలు జరుపుతున్నా వంతెనపై షీటును ఏర్పాటు చేసేందుకు సన్నద్ధం అవుతున్నాడు. వంతెన నిర్మాణానికి సుమారు రూ.2.10 లక్షలు వరకు ఖర్చు అయ్యిందని, ఇందులో రూ.30 వేలు మరో రైతు ఇచ్చినట్లు చెప్పుకొచ్చాడు. 20 రోజుల సమయం పట్టిందని పేర్కొన్నాడు. రాములు వల్ల ఎంతో ప్రయోజనం జరిగిందని తోటి రైతులంతా రుణపడి ఉంటామంటూ అభినందిస్తున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని గుండువాగులోని ముళ్లపొదలను తొలగిస్తూ రైతులకు అవసరమగు చోట బ్రిడ్జిలను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

బిక్కుబిక్కుమంటూ దాటేవాళ్లం



నేను వ్యవసాయం మీదనే ఆధారపడి జీవనం సాగిస్తాను. నాకు ఉన్నా భూమి పూర్తిగా గుండు వాగు అవతలివైపునే ఉంది. ఎన్నోసార్లు తూకం పోసి వాగు రావడంతో నాటు వేయలేకపోయాను. మందులు చల్లడం, కలుపులు తీయడం, మందు పిచికారీ చేయడం సమయానికి జరగకపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉండేది. వాగు దాటాలన్నా బిక్కుబిక్కుమంటునే దాటేవాళ్లం. కూలీలు భయపడి ఎవరూ వచ్చేవారు కాదు. వంతెన నిర్మించుకోవడానికి సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చయింది.

పత్తి పంటలో గంజాయి సాగు


గంజాయి మొక్కలను చూపుతున్న అధికారులు

158 మొక్కలు ధ్వంసం, నిందితుడి అరెస్ట్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామ శివారులో చేస్తున్న గంజాయి సాగుపై జిల్లా ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. జిల్లా ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గాంధీనాయక్, చంద్రశేఖర్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన బీ.అశోక్ అనే వ్యక్తి పత్తి పంటలో గంజాయిని అంతర పంటగా సాగు చేస్తున్నాడు. నమ్మదగ్గ సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం గంజాయి సాగు చేస్తున్న పంట పొలంపై అధికారులు దాడులు నిర్వహించారు. స్థానిక రెవెన్యూ, పోలీసుల సహకారంలో పొలంలో సాగు చేసిన 158 మొక్కలను ధ్వంసం చేశారు. వాటి విలువ సుమారు రూ.1.60 లక్షలు వరకు ఉంటుందని సమాచారం. అశోక్ బైక్‌ను తనిఖీ చేయగా కొద్దిపాటి ఎండు గంజాయి లభించింది. వెంటనే బైక్‌ను, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐలు తెలిపారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ అలీం, పోలీస్ సిబ్బంది గోపాల్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

బ్యాండ్ కొట్టేందుకు వెళ్లి.. చెరువులో శవమై

పటాన్‌చెరు టౌన్: వినాయకుడి వద్ద బ్యాండ్ కొట్టేందుకు వెళ్లిన వ్యక్తి చెరువులో శవమై తేలిన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నాగరాజు కథనం మేరకు.. అమీన్‌పూర్ పరిధిలోని వందనపురి కాలనీ శివ సాయిరాం(25) కూలీ పని చేసుకుంటున్నాడు. 10వ తేదీ రాత్రి ఇంట్లో మద్యం సేవించి అనంతరం వినాయకుడి వద్ద బ్యాండ్ కొట్టి వస్తానని భార్య సంధ్యకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా శుక్రవారం ఇసుక బాయి చెరువులో మృతి చెంది నీటిపై తేలి కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సంధ్య తన భర్త మద్యం మత్తులో చెరువులో జారి పడి మృతి చెంది ఉండొచ్చని ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పీడీఎస్ బియ్యంతో పోలీసులు

కోహెడరూరల్(హుస్నాబాద్): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ అభిలాష్ కథనం మేరకు.. కోహెడ గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో డీసీఎం 341 బస్తాల్లో సుమారు 164 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ముద్రకోలా అనిల్, పత్తిరి రాజయ్య వరంగల్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పీడీఎస్ రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరివేసుకొని ముగ్గురు బలవన్మరణం

వేర్వేరు చోట్ల ఉరి వేసుకొని ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దుబ్బాకలో అప్పుల బాధతో హమాలీ కార్మికుడు, చేగుంటలో ఆర్థిక ఇబ్బందులతో రైతు, పటాన్‌చెరులో మద్యానికి బానిసై వ్యక్తి తనువు చాలించారు.

అప్పుల బాధతో హమాలీ


నరేశ్ (ఫైల్)

దుబ్బాకటౌన్: అప్పుల బాధతో హమాలీ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాదకర ఘటన దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్రూం ఇళ్లలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక పట్టణానికి చెందిన మర్కంటి నరేశ్ (37) హమాలీ పనులు చేస్తూ భార్య వనజ, ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబ అవసరాలు, ఆరోగ్య పరిస్థితి సరిగా లేక అప్పులు చేశాడు. సొంత ఇంటిని, బైక్‌ను అమ్మి కొంత అప్పును తీర్చగా, మరికొంత మిలిగి ఉంది. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురై, జీవితం పై విరక్తితో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య వనజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు


భిక్షపతి (ఫైల్)

చేగుంట(తూప్రాన్): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మాసాయిపేట మండలంలోని పోతాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన అరికెల భిక్షపతి(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా భిక్షపతి ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతుండగా ఇదే విషయంలో భార్య పోచమ్మతో గురువారం రాత్రి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం ఇంటిపక్కనే చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

పటాన్‌చెరు టౌన్: మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అమీన్‌పూర్ పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ హనుమాన్ దేవాలయం పక్కనే నాగరాజు(32) భార్య కుమారులతో కలిసి నివాసం ఉంటున్నాడు. 8వ తేదీన భార్య పుష్పలత, కుమారుడు యశ్వంత్ స్వగ్రామం మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట్‌కు వెళ్లారు. మద్యానికి బానిసైన నాగరాజు మద్యం మత్తులో ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఎర్రోళ్ల పుష్పలత శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మృతిపై అనుమానాలు

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

- కొడుకుపై బంధువులు పోలీసులకు ఫిర్యాదు
- నారాయణఖేడ్ మండలం తుర్కాపల్లిలో ఘటన


పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు

నారాయణఖేడ్: ఓ మహిళ బుధవారం అర్ధరాత్రి మృతి చెందగా మరుసటిరోజు కుటుంబీకులు, బంధువులు ఖననం చేశారు. ఆ సమయంలో మృతదేహంపై గాయాలు ఉన్నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం పూడ్చిన మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఘటన నారాయణఖేడ్ మండలం తుర్కాపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఖేడ్ ఎస్సై విద్యాచరణ్‌రెడ్డి కథనం మేరకు.. ఖేడ్ మండలం తుర్కపల్లికి చెందిన బంటు రాజమ్మ, సాయిలు దంపతులకు కుమారులు నర్సింహులు, శ్రీనివాస్ ఉన్నారు. సాయిలు 15 ఏళ్ల కిందట మృతి చెందగా కుమారులను తల్లే పెంచి పోషిస్తుంది. పెద్ద కుమారుడు నర్సింహులు ఐదేళ్ల కిందట మృతి చెందగా, చిన్నకుమారుడు శ్రీనివాస్‌తో కలిసి ఉంటుంది. శ్రీనివాస్ ఏడాది కిందట అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. కూలి పనులు చేసుకుంటూ తల్లి, భార్యను పోషిస్తూ ఉన్నాడు. కొద్దిరోజులుగా మద్యానికి బానిసై గ్రామంలో జులాయిగా తిరుతుగున్నాడు. డబ్బుల కోసం తల్లిని తరచూ వేధించేవాడు. బుధవారం రాత్రి రాజమ్మ(50) ఆకస్మికంగా మృతి చెందిందంటూ కుమారుడైన శ్రీనివాస్ గ్రామస్తులకు చెప్పాడు. గురువారం అంత్యక్రియలు నిర్వహిస్తుండగా బంధువులు మృతదేహంపై గాయాలు గుర్తించారు. కుమారుడే హత్య చేసినట్లు అనుమానిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ భాస్కర్ సమక్షంలో మృతదేహాన్ని వెలికితీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

జల్సాలకు అలవాటుపడి బైక్‌ల దొంగతనం

- జైలుకు వెళ్లొచ్చినా మారని తీరు
- పోలీసుల అదుపులో మేస్త్రీ



వివరాలు వెల్లడిస్తున్న సీఐ లక్ష్మీబాబు

సిద్దిపేటకమాన్: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న దొంగను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు కథనం మేరకు.. దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామానికి చెందిన ఇనుప స్వామి (47) పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ మేస్త్రీ పని చేస్తుండేవాడు. మద్యానికి, జల్సాలకు అలవాటు పడి డబ్బులు సరిపోకపోవడంతో బైక్‌ల దొంగతనం మొదలు పెట్టాడు. రెండు నెలల కిందట బైక్‌లు దొంగిలించిన కేసులో 50 రోజులు జైలుకెళ్లి 11వ తేదీన బయటకు వచ్చాడు. అదే రోజు సాయంత్రం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి పార్కింగ్ స్థలంలో ఓ బైక్‌ను దొంగలించి పెద్ద చీకోడ్ గ్రామంలో భద్రపర్చాడు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద దొంగలించిన బైక్‌ను అమ్మడానికి వెళ్తుండగా రూరల్ పోలీసు స్టేషన్ వద్ద వాహనాల తనిఖీ కొనసాగుతుంది. పోలీసులను చూసి స్వామి పారిపోయే ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకొని విచారించారు. తాను చేసిన నేరం ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి రెండు బైక్‌లను స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సీఐ వెంట కానిస్టేబుళ్లు భూమలింగం, నాగరాజు ఉన్నారు.

తండ్రీకొడుకులను ఢీకొట్టిన లారీ

కుమారుడు మృతి, తండ్రికి తీవ్ర గాయాలు


జశ్వంత్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: బైక్‌పై వస్తుండగా లారీ ఢీకొట్టడంతో కుమారుడు మృతి చెందగా తండ్రికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్‌ఐ అభిమాని సింగ్ కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా కంది మండలానికి చెందిన చాకలి నరేశ్ ప్రైవేటు ఉద్యోగం చేసున్నాడు. శుక్రవారం బైక్‌పై ఐదో తరగతి చదువుతున్న తన కుమారుడు జశ్వంత్(12)ను తీసుకొని గణేశ్ గడ్డ దేవస్థానానికి బయలుదేరాడు. దేవస్థానం సమీపంలోకి రాగానే వెనుక నుంచి వచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. అనంతరం జశ్వంత్‌ను మెరుగైన వైద్యం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి పడిపోవడంతో..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన జిన్నారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగలక్ష్మి కథనం మేరకు.. గుమ్మడిదల మండలం వీరన్న గూడెం గ్రామానికి చెందిన సయ్యద్(47) గురువారం బైక్‌పై జిన్నారంలోని స్నేహితుడు సత్యనారాయణను కలిసేందుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. భార్య గౌసియా ఫోన్ చేస్తే కలవకపోవడంతో అతడికి ఫోన్ చేసింది. మీరు ఎక్కడికి వెళ్లారని అడగడంతో ఇద్దరం కలిసి జిన్నారంలో కల్లు తాగిన తర్వాత సయ్యద్ ఇంటికి బయలుదేరాడు అని చెప్పాడు. శుక్రవారం వెతుకుతుండగా జిన్నారం గ్రామ శివారులో ప్రైవేట్ కంపెనీ దగ్గరలో రోడ్డు పక్కన బైక్‌తోపాటు పడిపోయి మృతి చెంది కనిపించాడు. తన భర్త బైక్ అదుపుతప్పి పడిపోవడంతో మృతి చెందాడని గౌసియా పోలీసులకు ఫిర్యాదు చేశారు.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొమరంభీం కాలనీకు చెందిన శ్రీను (54) ఇసుక వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం బైక్‌పై తెల్లాపూర్ నుంచి ఉస్మాన్‌నగర్‌కు వెళ్తున్నాడు. తెల్లాపూర్ రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ సమీపంలోకి రాగానే బైక్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని మద్దికుంట చౌరస్తాలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. సదాశివపేట వైపు నుంచి సింగూర్ ప్రాజెక్టులో వినాయక నిమజ్జనానికి వెళ్తున్న కారును జహీరాబాద్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గరికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108లో ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

యువకుడి ప్రాణం తీసిన అడవి పందులు


సాయికుమార్ (ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): బైక్‌పై నుంచి పడి వ్యక్తి చెందిన ఘటన మండల పరిధిలోని ఫరీద్‌పూర్ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన దాసరి బ్రహ్మం కుమారుడు దాసరి సాయికుమార్ (18) అదే గ్రామానికి చెందిన తుపాకీ గణేశ్ ఇద్దరూ కలిసి సర్దన గ్రామంలోని వారి స్నేహితుడి దగ్గరకు వెళ్లారు. తిరిగి వస్తున్న ఈ క్రమంలో రోడ్డుకు అడ్డంగా అడవి పందులు రావడంతో అదుపుతప్పి కింద పడ్డారు. ఇందులో సాయికుమార్‌కు తీవ్ర గాయాలు కాగా, గణేశ్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఇద్దరినీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయికుమార్ మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హవేళిఘణాపూర్ ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.